వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



ఆలయంలో జరిగిన పూజ కార్యక్రమంలో పాల్గొన్న జంపన ప్రతాప్

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు మూడవ వార్డు మడ్‌ఫోర్ట్‌లో నూతనంగా నిర్మించిన శ్రీదేవి నల్లపోచమ్మ ఆలయంలో విగ్రహప్రతిష్ట కార్యక్రమం సోమవారం వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయంలో హోమం, అన్నదాన కార్యక్రమం, సాయంత్రం పుర వీధుల్లో అమ్మ వారి ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సంతోష్, లోకేష్, మహేందర్, బలరాం, బాలాజీ, హరి, నరేందర్, కరుణాకర్, వంశీ, వినయ్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలి



మాట్లాడుతున్న హరియాణ గవర్నర్ దత్తాత్రేయ

అమీర్‌పేట: పేద, బడుగు వర్గాల ప్రజలకు ఉపయోగకరంగా ఉండే విధంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. అమీర్‌పేట ఆదిత్య పార్క్ హోటల్‌లో సోమవారం అలయ్ బలయ్ ఫౌండేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు ప్రజలకు ఎంతోగానో ఉపయోగపడుతున్నాయన్నారు.

మెల్‌బోర్న్‌లో ఆవిర్భావ దినోత్సవం



వేడుకలకు హాజరైన ఎన్‌ఆర్‌ఐలు

సనత్‌నగర్: మెల్‌బోర్న్‌లో బీఆర్‌ఎస్ ఆస్ట్రేలియా అధ్యక్షుడు కాసర్ల నాగేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు వైభవంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన కేసీఆర్ పాలన గురించి వివరించారు. బీఆర్‌ఎస్ యూత్ వింగ్ నాయకుడు వినయ్ సన్నీ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

పార్క్ చేసిన బైక్ చోరీ

సనత్‌నగర్: పార్క్ చేసిన బైక్ చోరీకి గురైన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు..బేగంపేట శ్యాంలాల్‌బిల్డింగ్స్ తాతాచారికాలనీకి చెందిన బంకా శివకుమార్ తన హోండా సీబీ షైన్‌ను ఈ నెల 23న రాత్రి 9 గంటలకు తన ఇంటి ముందు పార్క్ చేశాడు. మరుసటి రోజు ఉదయం చూడగా బైక్ కనిపించలేదు. అన్నిచోట్ల వెతికినా కనిపించకపోవడంతో బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి చేసుకోపోతే చంపేస్తా..

యువతిని బెదిరిస్తున్న యువకుడిపై కేసు నమోదు..

సనత్‌నగర్: నిన్ను ప్రేమిస్తున్నాను..నన్ను పెళ్లి చేసుకోవాలి..లేకుంటే చంపేస్తానంటూ ఓ యువతిని బెదిరిస్తున్న యువకుడిపై బేగంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు..బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్స్‌లో నివాసం ఉండే ఓ యువతి (28)కి 2021లో ఉమర్ అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. ఆ పరిచయం ప్రేమకు దారితీసింది. అయితే ఉమర్ యువతిపై అనుమానం పెంచుకోవడంతో ఆమె అతన్ని దూరం పెట్టింది. గత ఆరు నెలలుగా పెళ్లి చేసుకోవాలంటూ ఫోన్లు చేస్తూ, సందేశాలు పంపిస్తూ ఆమెను మానసికంగా వేధించసాగాడు. గత నెల 30న రాత్రి 9 గంటలకు ఆమె ఇంటికి వచ్చి గొడవకు దిగాడు. తనను వివాహం చేసుకోకపోతే చంపేస్తానని బెదిరించాడు. దీంతో బాధితురాలు బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా ఉమర్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 15, నల్లవంకాయ 25, పొడుగువంకాయ 25, బెండకాయ 45, పచ్చిమిర్చి 40, బజ్జిమిర్చి 28, క్యాప్సికం 55, పచ్చికాకరకాయ 38, పందిరిబీర 55, క్యాబేజీ 15, క్యారెట్ 37, దొండకాయ 18, గుండు బీన్స్ 125, గింజచిక్కుడు 75, గోకరకాయ 40, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 18, ఆలుగడ్డ 24, చామగడ్డ 33, మొరంగడ్డ 19.

దుర్వాసన.. దురవస్థ..

అరకొర జీతాలతో ఇబ్బంది పడుతున్న పారిశుద్ధ్య కార్మికులు

రామంతాపూర్: వేకువజామున ఉదయం 3 గంటల నుంచి విధుల్లో చేరి ఉదయం నుంచి సాయంత్రం వరకు రహదారులపై వీధుల్లో పేరుకుపోయిన చెత్త, ఇతర వ్యర్థాలను శుభ్రం చేస్తూ.. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం అందించడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకం. ఓ విధంగా చెప్పాలంటే ప్రజలకు ఆరోగ్యం, మంచి వాతావరణం అందించే ఆరోగ్య ప్రదాతలని వీరిని అనవచ్చు.

90 శాతం మహిళా కార్మికులే..

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అన్ని జీహెచ్‌ఎంసీ సర్కిల్‌లో 90 శాతం మంది మహిళలే పారిశుద్ధ్య కార్మికులుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా బడుగు, బలహీనవర్గాలకు చెందిన వారే. వేకువజామున ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎముకలు కొరికే చలి, ఎండ, వర్షంలోనైనా పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తారు.

దుర్వాసన భరించి..

వర్షానికి తడిసి, కుళ్లిపోయి దుర్వాసన వస్తున్న వ్యర్థాలను తమ చేతులతో తొలగిస్తారు. గతంలో మాజీ సీఎం కేసీఆర్ వీరి సేవలను గుర్తించి పారిశుద్ధ్య కార్మికులు దేవుళ్లతో సమానమని ప్రశంసించారు. వీరంతా గత రెండున్నర శతాబ్దాలుగా కాంట్రాక్టు కార్మికులుగా కొనసాగుతూ.. ప్రభుత్వం పర్మనెంట్ చేస్తుందని ఆశతో ఎదురుచూస్తున్నారు.

చాలీ, చాలనీ జీతాలు

కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులకు జీహెచ్‌ఎంసీ ప్రతినెల రూ.18 వేల జీతం అందిస్తున్నట్లు సమాచారం. అందులో ఈఎస్‌ఐ, పీఎఫ్ మినహాయించి దాదాపు రూ.14 వేలు మాత్రమే చేతికి వస్తుంది. దుమ్ము, ధూళి దుర్గంధాలతో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఒళ్లు నొప్పులు, శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతూ వారికి వచ్చే జీతాన్ని ఎక్కువశాతం చికిత్సలకే ఖర్చు పెడుతున్నారు.

నిత్యవసరాల పెరుగుదలతో అవస్థలు..

పెరుగుతున్న నిత్యవసర సరుకుల ధరలు, వారి ఆరోగ్యానికి సంబంధించిన మందులు ఇతర ఖర్చులకు జీతం సరిపోక అనేక ఆర్థిక ఇబ్బందులకు గురౌతున్నారు. నెల జీతం రూ.30 వేలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. దుమ్ము, ధూళిని ఎదుర్కొవడానికి మాస్కులు, చేతులు శుభ్రం చేసుకునేందుకు సబ్బులు కూడా అందజేయాలని డిమాండ్ చేస్తున్నారు.



విధులు నిర్వహించేటప్పుడు ప్రమాదాలు..

ప్రధాన రహదారిలోని రోడ్లను ఊడ్చి శుభ్రపరిచేటప్పుడు వేగంగా వచ్చే వాహనాలు పారిశుద్ధ్య కార్మికులను ఢీకొట్టి ప్రమాదాలు జరుగుతున్నాయి. గత రెండేళ్ల క్రితం అంబర్‌పేట్ ప్రధాన రహదారులు విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య మహిళను ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు వదిలింది. అదే విధంగా ఇటీవల రామంతాపూర్ రాంరెడ్డినగర్‌లో చెత్త రోడ్లపై వేయొద్దని ఓ మహిళను పారిశుద్ధ్య కార్మికురాలు వారించినందుకు ఆ మహిళా కుటుంబసభ్యులు వచ్చి పారిశుద్ధ్య కార్మికులపై దాడికి పాల్పడ్డారు.

రహదారుల రూపురేఖలు మారాలి

- సికింద్రాబాద్ రహదారులు ఆధునీకరించాలి
- చెత్త తొలగింపు పనులు వేగవంతం చేయాలి
- చిలకలగూడ, పాటిగడ్డ జంక్షన్‌ల ఆధునీకరణ
- జోనల్ కమిషనర్ రవికిరణ్



సమావేశంలో మాట్లాడుతున్న జీహెచ్‌ఎంసీ జడ్‌సీ రవికిరణ్

సికింద్రాబాద్: చెత్తచెదారం, దుర్గంధంతో కూడిన సికింద్రాబాద్ ప్రాంత రహదారుల రూపురేఖలు మార్చడంతోపాటు ప్రయాణికుల సమస్యలు తొలగించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ ఎన్.రవికిరణ్ సూచించారు. సోమవారం సికింద్రాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ నార్త్‌జోన్ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో ఆయన కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కంటోన్మెంట్ బోర్డు జాయింట్ సీఈవో పల్లవి విజయ వర్షిని, ట్రాఫిక్ ఏసీపీలు శంకర్ రాజు, సంపత్ కుమార్, జలమండలి సీజీఎం ప్రభు, జీహెచ్‌ఎంసీ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆశాలత, సిటీ ప్లానర్ శ్రీనివాస్. విద్యుత్ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ రవికిరణ్ మాట్లాడుతూ.. రహదారులకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్త చెదారాలు ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. రహదారులపై చెత్త వేయకుండా ఉండేందుకు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు కొనసాగించాలన్నారు.

- ప్రస్తుతం ఏర్పాటు చేసి ఉన్న విద్యుత్ దీపాల నిర్వహణ వ్యవహారాలను సక్రమంగా కొనసాగించడంతోపాటు, అవసరమైన ప్రాంతాల్లో కొత్త దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. చిలకలగూడ, పాటిగడ్డ జంక్షన్‌లలో ఆధునీకరణ పనులు త్వరగా ప్రారంభించాలన్నారు. ఫుట్‌ఓవర్ వంతెనల నిర్వహణ వ్యవహారాలను క్రమబద్ధీకరించాలన్నారు. సమావేశంలో పేర్కొన్న అంశాలకు సంబంధించిన పనులన్నింటిని నెల రోజుల్లోగా పూర్తి చేయాలని జడ్‌సీ కోరారు.

అన్ని వర్గాలకు సమన్యాయం దక్కాలి

ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలోని సికింద్రాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం సందడిగా జరిగాయి. ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఎన్నో త్యాగాలు, ఉద్యమాల ఫలితంగా సాధించుకున్న ప్రత్యేక తెలంగాణా రాష్ట్రంలో అన్ని వర్గాలకు సమన్యాయం దక్కాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. అనంతరం పద్మారావుగౌడ్ మిఠాయిలు పంచిపెట్టారు. కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, రాసూరి సునీత, లింగాని ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేసిన ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోండి

కాచిగూడ: హర్రాస్‌పెంట హిందూ శ్మశానవాటిక ట్రస్‌బోర్డు ఆధ్వర్యంలో శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో ఫిజియోథెరపీ, క్లినిక్, కుట్టు శిక్షణ, మెహింది, బోటిక్, యోగా తదితర విభాగాల్లో అందిస్తున్న ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవాలని బోర్డు అధ్యక్షుడు రాజేందర్ పటేల్ కోరారు. సోమవారం దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పేదల కోసం లక్షలు వెచ్చించి నిర్వహిస్తున్న క్లినిక్‌లో షుగర్, బీపీ, బ్లడ్ టెస్ట్ తదితర వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్నామని అన్నారు. ఉచితంగా మందులను సైతం అందజేస్తున్నట్లు తెలిపారు. మొదటి అంతస్తులో ఆధ్యాత్మిక పుస్తకాలతో కూడిన రీడింగ్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సెక్యూరిటీ గార్డు అదృశ్యం

బంజారాహిల్స్: అనుమానాస్పద స్థితిలో ఓ సెక్యూరిటీ గార్డు అదృశ్యమైన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... యూసుఫ్‌గూడ సమీపంలోని ఎల్ఎన్.నగర్‌లో నివసించే మ్యాథ్యూస్ అర్చన్ కుంజం (36) సికింద్రాబాద్‌లోని ఓ చర్చిలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. ఈ నెల 23వ తేదీన మ్యాథ్యూస్ ఇంట్లో భార్యకు చెప్పకుండా బయటికి వెళ్లిపోయి మూడు రోజులుగా తిరిగి రాలేదు. దీంతో ఆమె ఫోన్ చేసినా స్పందించలేదు. ఈ నెల 26వ తేదీన మ్యాథ్యూస్ పని చేస్తున్న చర్చికి వెళ్లి చూడగా ఫలితం లేదు. దీంతో తన భర్త కనిపించడం లేదంటూ పుష్పవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని గాలింపు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్: 87125 69090 నెంబర్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

ట్రేడింగ్ మోసాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలి

ముషీరాబాద్: ట్రేడింగ్ కంపెనీలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు ఇస్తామని చెప్పి కోట్ల రూపాయలు దండుకున్న ఎస్‌జీ ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నేషన్ కన్స్యూమర్ కమిషన్ డిప్యూటీ చైర్మన్ తిక్కుంట్ల విశాల్, ప్రచార కమిటీ చైర్మన్ పొట్ట పింజర రమేష్ కోరారు. అడిక్‌మెట్‌లోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. యూనివర్సిటీలో పని చేస్తున్న లక్ష్మీప్రసన్న ఆమె సన్నిహితులు ఎస్‌జీ ఎంటర్‌ప్రైజెస్‌ను ఏర్పాటు చేసి మోసం చేశారన్నారు. మన్సూరాబాద్‌కు చెందిన సుమన్, స్వాతి దంపతుల నుంచి దాదాపు రూ.50 లక్షలను డిపాజిట్ చేయించి మోసం చేశారని ఆరోపించారు. వీరిపై చర్యలు తీసుకోవాలని బాధితులు వనస్థలిపురం పీఎస్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. వీరే కాకుండా అనేక మంది బాధితులు ఉన్నారని పేర్కొన్నారు. ఈ ఘటనపై నగర పోలీస్ కమిషనర్ స్పందించి బాధితులకు న్యాయం చేయాలని వారు కోరారు.

గురుకుల డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలు ప్రారంభించండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా 27 సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా కాలేజీల్లో ప్రవేశాలను ప్రారంభించాలని మాల స్టూడెంట్స్ జేఏసీ చైర్మన్ మాదాసు రాహుల్ సోమవారం డిమాండ్ చేశారు. బీసీ, ఎస్టీ గురుకుల కాలేజీల్లో దోస్త్ ద్వారా అడ్మిషన్లు చేపట్టి ఎస్సీ గురుకులాల్లో నిలిపివేయడం పై పలు అనుమానాలు తలెత్తున్నాయన్నారు. ఎస్సీ గురుకుల డిగ్రీ కాలేజీలను మూసి వేస్తే పది వేల మంది విద్యార్థినులకు నష్టం జరుగుతుందన్నారు. ఈ విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు చేపట్టకుండా డిగ్రీ కాలేజీలను మూసివేస్తే సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఉత్సాహంగా సైకిల్ ర్యాలీ



సనత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం వినూత్నంగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ నేతృత్వంలో సీనియర్ నాయకులు విశాల్ సూదం, మనోజ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీ బేగంపేట ఎయిర్‌పోర్ట్ వద్ద నుంచి ప్రారంభమై రసూల్‌పురా చౌరస్తా వరకు కొనసాగింది.

8న సామూహిక 'భగవద్గీత పారాయణం'

నల్లకుంట: సనాత ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో ఈనెల 8న సామూహిక భగవద్గీత పారాయణం కార్యక్రమం ఉంటుందని సమితి ప్రతినిధి వేముల వేణుగోపాల్ సోమవారం తెలిపారు. చందానగర్‌లోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో ఉదయం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కిషన్ రెడ్డి శ్రీకారం

లాలాపేట: నగరంలోని పౌర సమస్యలను తెలుసుకుని వాటికి పరిష్కారాలను చూపించేందుకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా సోమవారం సికింద్రాబాద్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో అధికారులతో కలిసి పర్యటించారు. లాలాపేట ఇందిరానగర్‌లో స్థానిక బస్తీల ప్రజలతో సమావేశం అయ్యారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వర్షపు నీటి కాలువల్లో సిల్ట్ పూడిక తీత పనులు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్,కమ్యూనిటీ హాల్స్ తదితర సమస్యలను ప్రజలు మంత్రికి తెలియజేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ నగరంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం, అధికారులపై ఉందన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి వెంటనే సిల్టు తొలగించాలనీ అధికారులను కోరారు. సమస్య పరిష్కరించకపోతే ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజక వర్గం అభివృద్ధి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. మాజీ మేయర్ బండ కార్తీకచంద్రారెడ్డి, తార్నాక డివిజన్ అధ్యక్షులు ఉపేందర్ యాదవ్,కరుణాకర్ పాల్గొన్నారు.



వినతి పత్రాలను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

చిన్నారులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

సనత్‌నగర్: చిన్నతనం నుంచి ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని దాని సాధన దిశగా పట్టుదలతో ముందుకుసాగాలని ఎమ్మెల్సీ వాణీదేవి విద్యార్థులకు సూచించారు. బేగంపేటలోని స్వామి రామానందతీర్థ మెమోరియల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు వేడుకలు సోమవారం జరిగాయి. మెమోరియల్ కమిటీ ఆడిటోరియంలో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా చిన్నారులు చేసిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పీవీ ప్రభాకర్‌రావు, శేఖర్ మారంరాజు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

త్వరలో వినాయకనగర్ బస్తీ ఎన్నికలు

రహమత్‌నగర్: బస్తీలో సొంత నివాసమున్న ప్రతి ఒక్కరూ తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఎస్పీఆర్‌హిల్స్ వినాయకనగర్ వీకర్స్ సెక్షన్ అసోసియేషన్, అబ్జర్వేషన్ డెవలప్‌మెంట్ కమిటీ నాయకులు వీరస్వామి యాదవ్, డానియల్, మాణిక్యం, శ్రీనివాస్, కేశవులు తదితరులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం రాత్రి స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ... బస్తీ కార్యవర్గం కాలపరిమితి ముగిసినందున ఎన్నికల నిర్వహించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇందులో భాగంగానే బస్తీ ఓటర్ల వివరాల కోసం జనరల్ లిస్టు రూపొందిచనున్నట్లు తెలిపారు. త్వరలోనే మరోమారు సమావేశం ఏర్పాటు చేసి తుది నిర్ణయం తీసుకుంటామని వారు వివరించారు. నేతలు పద్మారావు, అమృతరావు, ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

అంబరాన్నంటిన 'ఆవిర్భావ' సంబురం

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు వాడవాడలా అంబరాన్నంటాయి. సనత్‌నగర్, సికింద్రాబాద్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో నాయకులు, కార్యకర్తలు 'ఆవర్భావ' సంబరాలను నిర్వహించారు. జాతీయ జెండాలను ఎగురవేసి జాతీయతను చాటిచెప్పారు. తెలంగాణ ఉద్యమ పంథాను స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. – సనత్‌నగర్



బేగంపేట స్వామి రామానంద తీర్థలో ఎమ్మెల్సీ వాణీదేవి..



టీజీపీఎస్సీలో జాతీయ జెండా ఎగురవేస్తున్న సభ్య కార్యదర్శి రవి..



కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో బోర్డు సీఈఓ మధుకర్ నాయక్



అడ్డగుట్ట బస్టాండ్ వద్ద కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి



సనత్‌నగర్‌లో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి..



పద్మారావునగర్‌లో..



ఓయూలో..



బేగంపేటలో కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి..



బోయిన్‌పల్లి మార్కెట్ వద్ద..



పీసీజీ కార్యాలయం వద్ద బోనాలతో మహిళా ఉద్యోగులు

అధ్వాన రోడ్లు..



బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ పాట్ మార్కెట్ రోడ్లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. గోతులమయంగా మారిన రోడ్లపై నుంచి రాకపోకలు సాగించలేక వాహనచోదకులు నరకం చూస్తున్నారు. మోండా మార్కెట్ డివిజన్‌లోని ఈ రోడ్డులో పలువురు ప్రమాదాలకు గురై గాయపడ్డారు. సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల నుంచి అనేక మంది పాట్ మార్కెట్ రోడ్డు గుండా రాకపోకలు సాగిస్తుంటారు. అధికారుల నిర్లక్ష్యం.....ప్రజలకు ప్రాణ సంకటంగా మారింది. ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని కనీసం మరమ్మతులు కూడా జీహెచ్‌ఎంసీ సిబ్బంది చేయడం లేదని స్థానిక వ్యాపారులు వాపోతున్నారు.

